కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

నేరేడుచర్ల, జూన్ 3 : ప్రతి కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త మేడిపల్లి కృష్ణయ్య ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల పార్టీ బీమా చెక్కును సోమవారం సూర్యాపేటలో మృతుడి కుటుంబసభ్యులకు ఆయన అందించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, మున్సిపల్ మాజీ వైర్మన్ జయబాబు, ఎంపీటీసీ లింగయ్యయాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణ గాంధీ కేసీఆర్

పీఏసీఎస్ డైరెక్టర్ హేమ్లానాయక్

గారకుంటతండాలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న హేమ్లానాయక్

గరిడేపల్లి, జూన్ 3 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే సాధ్యమైందని, ఆయన తెలంగాణ గాంధీ అని సర్వారం పీఏసీఎస్ డైరెక్టర్ గుగులోతు హేమ్లా నాయక్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మండలంలోని గారకుంటతండాలో పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామ్‌నాయక్, గుగులోతు సందీప్‌నాయక్, నరేందర్‌నాయక్, రవీందర్, కోటయ్య, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

విత్తన డీలర్లు స్టాక్ వివరాలను ప్రదర్శించాలి

- విజిలెన్స్ అధికారి గౌస్

విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తిరుమలగిరి, జూన్ 3 : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్‌కే గౌస్ ఆదేశించారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు స్టాక్ వివరాలు షాపులో ప్రదర్శించాలని, అమ్మే విత్తనాలకు సంబంధించిన కంపెనీ ఇన్వాయిస్‌ను తనిఖీ సమయంలో చూపించాలని సూచించారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయించినా, కృతిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- ఏడీఏ సంధ్యారాణి

హుజూర్‌నగర్, జూన్ 3 : విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ సంధ్యారాణి, సీఐ చరమందరాజు హెచ్చరించారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని రైతు వేదికలో విత్తనాల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విత్తనాల విక్రయ సమాచారాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ ముత్తయ్య, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసు : సీఐ

తుంగతుర్తి : ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ డి.శ్రీను హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నకిలీ విత్తనాలు ఇస్తే దిగుబడి సరిగా రాక వారు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ ఏడుకొండలు, ఏఓ బాలకృష్ణ, ఏఈఓలక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాలు విడుదల

సూర్యాపేట అర్బన్, జూన్ 3 : పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు సూర్యాపేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,325 మంది విద్యార్థులు హాజరుకాగా ఎంపీసీ విభాగంలో 85.63 శాతం, బైపీసీ విభాగంలో 83.66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మెరిట్ ఆధారంగా త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లను కేటాయించనున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-327729-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం

మరిన్ని వివరాలకు: నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | తాటిపత్రి: 9182777638

వానకాలం సాగు షురూ

- ఆదివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం
- దుక్కులు దున్నే పనిలో రైతులు బిజీ



నాగారం : వర్ధమానుకోటలో దుక్కి దున్నుతున్న రైతు

తిరుమలగిరి, జూన్ 3 : నైరుతి రుతుపవనాలు మరో రెండు రోజుల్లో రాష్ట్రానికి రానుండగా.. ముందస్తుగా కురుస్తున్న వర్షాలతో రైతులు వానకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఆదివారం మండలంలో కురిసిన వర్షానికి కొంతమంది రైతులు దుక్కులు దున్నుతుండగా, మరి కొంతమంది వరి పొలాల్లో పెంట మట్టి తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా మండలంలో ఎక్కువ మంది రైతులు పత్తిసాగు పైనే ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే దుక్కులు దున్నుతున్న రైతులు మరో వర్షం పడితే పత్తి విత్తనాలు నాటేసేందుకు సిద్ధమవుతున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆత్మకూర్(ఎస్) : మండలంలో అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు చాలా మంది రైతులు దుక్కులు దున్ని పెంట మట్టిని తోలి చెల్కలను చదును చేసుకున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మరోసారి పొలాన్ని దున్ని పత్తి గింజలు విత్తారు. మరో రెండు వర్షాలు పడితే గింజలు మొలకెత్తుతాయని రైతులు పేర్కొంటున్నారు.

పత్తిసాగువైపే రైతుల మొగ్గు

నాగారం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 26 మిల్లీ మీటర్ల వాన పడడంతో భూములన్నీ చల్లబడ్డాయి. దాంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. చెలకలను దున్ని నాట్లకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే దుక్కి దున్నిన రైతులు పత్తి విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని వ్యాపీతండా, వర్ధమానుకోటతో పాటు పలు గ్రామాల్లో రైతులు సోమవారం పత్తి గింజలు నాటారు. వరి సాగు చేసే రైతులు నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు.

తిరుమలగిరి: పశువుల పెంటమట్టిని ట్రాక్టర్‌తో చేనుకు తరలిస్తున్న రైతు

ఆత్మకూర్(ఎస్) : పత్తి గింజలు విత్తుతున్న కూలీలు

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

- రూ.4.30 లక్షలు రికవరీ

కేసు వివరాలను వెల్లడిస్తున్న తుంగతుర్తి సీఐ శ్రీను

తుంగతుర్తి, జూన్ 3 : తుంగతుర్తి పట్టణ కేంద్రానికి చెందిన నార్లపురం శ్రీనివాస్ ఇంటి తాళం పగులగొట్టి రూ.5లక్షలు చోరీ చేసిన వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. తుంగతుర్తి సీఐ డి. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తికి చెందిన కొల్లూరి సురేశ్ ఇనుపరాడ్‌తో శ్రీనివాస్ ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. బీరువాలో ఉన్న డబ్బులను దొంగిలించి బైక్‌పై పరారయ్యాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి నిందితుడికోసం గాలించారు. పట్టణంలోని సీసీ కెమెరాల పుటేజీలతో పాటు పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వారు ఇచ్చిన సమాచారం మేరకు నిందితుడిని పట్టుకొని తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. తాను దొంగిలించిన సొమ్ములోంచి రూ. 28వేలు ఖర్చు చేసి సెల్‌ఫోన్ కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడి నుంచి రూ.4.30 లక్షలను రికవరీ చేసినట్లు సీఐ వెల్లడించారు. దొంగతనం కేసును ఛేదించిన స్థానిక ఎస్ఐ ఏడుకొండలు, మద్దిరాల ఎస్ఐ మధునాయుడుతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

మహిళల సమస్యలపై నిరంతర ఉద్యమాలు

- మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి

నేరేడుచర్లలో సంఘం జెండా ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి

నేరేడుచర్ల, జూన్ 3 : మహిళల సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి అన్నారు. జాతీయ మహిళా సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం నేరేడుచర్లలో సంఘం పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఇస్తామన్న వాగ్దానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకురాలు నాగలక్ష్మి, సత్యవతి, శ్రావణి, సైదమ్మ, అరుణ పాల్గొన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని బర్రె మృతి

మఠంపల్లి, జూన్ 3 : మండలంలోని రఘునాథపాలెం బైపాస్ వద్ద గూడ్స్ రైలు ఢీకొని బర్రె మృతి చెందింది. కొందరు రైతులు బర్రెలను మేతకు వదలగా అవి రైల్వే ట్రాక్‌పైకి వచ్చాయి. అదే సమయంలో వస్తున్న గూడ్స్‌రైలు ఢీకొనడంతో బర్రె అక్కడికక్కడే మృతి చెందింది. మరొక దానికి గాయాలు కాగా స్థానిక పశువైద్యశాలలో వైద్యం అందించినట్లు బాధిత రైతులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కోదాడ రూరల్, జూన్ 3: మునగాల మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన గాజుల రవి(36) కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఇంట్లో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల రవి కోదాడ డిపోలో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలో నివాసముంటున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులు సొంతూరికి వెళ్లగా రవి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య భువనేశ్వరి ఫిర్యాదు మేరకు సీఐ రాము పర్యవేక్షణలో పట్టణ ఎస్ఐ రంజిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్ మెకానిక్‌లకు సన్మానం

సైకిల్ మెకానిక్‌లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, జూన్ 3 : ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సైకిల్ రిపేర్ వృత్తిలో ఉన్న అప్జల్, సైదులును సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షులు శ్రీనివాస్ రావు, యూసుఫ్, సభ్యులు సురేశ్, వెంకట్‌రెడ్డి, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

సేవాశ్రమంలో పండ్లు పంపిణీ

సేవాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి

కోదాడ రూరల్, జూన్3: తెలంగాణ ఆవిర్భావ సంబురాల్లో భాగంగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల సేవాశ్రమంలో విద్యార్థులకు మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన నాయకుడు ఇమ్రాన్‌ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముత్తవరపు రమేశ్, నాయకులు వెంకట్‌రెడ్డి, బోసుబాబు, భిక్షం, శేషు, యరగాని శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికుడికి గాయాలు

తిరుమలగిరి, జూన్ 3 : రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిబండ తండాకు చెందిన బానోతు సోమలు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద చెత్త సేకరించి పారిశుధ్య వాహనంలో వేస్తుండగా వేగంగా వచ్చిన ట్రావెల్ వాహనం ఢీకొట్టింది. దాంతో అతడి తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే చికిత్స కోసం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న మిర్యాల ఆలయ భూముల కౌలు వేలం

నూతనకల్, జూన్ 3 : మండలంలోని మిర్యాల గ్రామంలో గల సీతారామచంద్ర స్వామి దేవాలయ భూముల కౌలు వేలాన్ని ఈ నెల 6న ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆలయానికి ఉన్న 103 ఎకరాలు భూములను సంవత్సరంపాటు కౌలుకు ఇచ్చేందుకు నిర్వహించే వేలంలో పాల్గొనే వారు లక్ష రూపాయల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య, జిల్లా నాయకులు దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, మన్నెం దశరథ, ఇరుగు కిరణ్, గునగంటి వెంకన్న, పల్లా వెంకన్న ఉన్నారు.

మొక్కలను సంరంక్షించాలి : ఎంపీడీఓ సునీత

నూతనకల్, జూన్ 3 : మండలంలోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ సునీత సూచించారు. సోమవారం మండలంలోని మాచనపల్లి, బిక్కుమళ్ల, లింగంపల్లి గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను పరిశీలించారు. మొక్కలు ఎండి పోకుండా రెండు రోజులకు ఒకసారి నీళ్లు పెట్టాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ల డ్రైవర్లను ఒక రోజు చెత్త సేకరణకు, మరో రోజు ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీటిని అందించేందుకు పంపించాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త మృతికి సంతాపం

అర్వపల్లి, జూన్ 3 : మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తవిటి బుచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ సోమవారం గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఓర్సు వెంకన్న, మార్కెట్ డైరెక్టర్ అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పొట్టెపాక సైదులు, మండల ఉపాధ్యక్షుడు కర్నాటి మురళి, మాజీ ఎంపీటీసీ రేఖల సైదులు, నాయకులు ఉన్నారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడి

నేరేడుచర్ల, జూన్ 3 : మండలంలోని లాల్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడి చేసినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాధితుల ఫిర్యాదులపై తక్షణ చర్యలు

- ఎస్పీ రాహుల్ హెగ్డే

బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, జూన్ 3 : ప్రజావాణిలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఐదు ఫిర్యాదులను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అధికారులతో మాట్లాడారు. ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సస్పెండ్

సూర్యాపేట, జూన్ 3 : లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కాపుగల్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. లైంగిక వేధింపుల విషయమై స్థానిక ఫిర్యాదుల కమిటీ అతడికి రెండు దఫాలు నోటీసులు జారీ చేసినా కమిటీ ఎదుట హాజరుకాలేదని తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా అతడిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే సామేల్



ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్, జూన్ 3 : ఎంపీపీ భూరెడ్డి కళావతీసంజీవరెడ్డి మామయ్య భూరెడ్డి పుల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం మండలంలోని గుండ్లసింగారం గ్రామానికి వెళ్లి పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, నాయకులు తీగల కరుణశ్రీ, పన్నాల మల్లారెడ్డి, బోడ్డుపల్లి అంజయ్య, వల్లమల్ల జయాకర్, చురకంటి చంద్రారెడ్డి, గుగులోతు సజ్జన్‌నాయక్ ఉన్నారు.

మార్సిజమే ప్రపంచానికి మార్గదర్శి

- సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచందర్

మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు రామచందర్

బొడ్రాయిబజార్, జూన్ 3 : ప్రపంచంలో అసమానతలు తొలగి సమ సమాజ నిర్మాణం జరుగాలంటే మార్సిజమే మార్గదర్శి అని సీపీఐఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ రామచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ చింత లక్ష్మక్క నగర్‌లో నిర్వహిస్తున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం రెండో రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన దేశంలోనూ వేల సంవత్సరాల నుంచి కులవర్గ పోరాటాలు ప్రజల మధ్య అంతరాలను పెంచి ఒకరిని మరొకరు ద్వేషించుకునే స్థాయికి చేర్చాయన్నారు. ప్రజలంతా కులమతాలు లేని సమాజం కోసం పోరాడాలన్నారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి చంద్ర అరుణ మాట్లాడుతూ సంఘం నిర్మాణం, సిద్ధాంతాలు, ఆచరణపై అవగాహన కల్పించారు. అలంతకు ముందు రెండో రోజు కార్యక్రమాన్ని సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణు క ప్రారంభించగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఝాన్సీలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్. శిరోమణి, లలిత, కల్పన, సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

కౌండిన్య గౌడ సంఘం కోదాడ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

శ్రీనివాస్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న కేఎల్ఎన్ ప్రసాద్

కోదాడటౌన్, జూన్ 3 : కౌండిన్య గౌడ సంఘం కోదాడ పట్టణ అధ్యక్షుడిగా గాలి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ సోమవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా కెఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు పుట్టా వెంకటేశ్, కారింగుల అరవింద్, గుండగోని పాపారావుగౌడ్, దేశగాని సాంబయ్యగౌడ్, ఉర్లుగొండ రాంబాబుగౌడ్ పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించాలి

- మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల, జూన్ 3 : మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయదారులు వాటికి సంబంధించిన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలని నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి సూచించారు. సోమవారం మాంసం దుకాణ దారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లలో కాకుండా ప్రభుత్వం అనుమతించిన కవర్లు, స్టీల్ డబ్బాల్లో మాత్రమే మాంసాన్ని విక్రయించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు బిల్లు తప్పక ఇవ్వాలి

జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

విత్తనాలు అమ్మే దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి

కోదాడ రూరల్, జూన్3: ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు అమ్మిన విత్తనాలకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలను ఎమ్మార్పీకే అమ్మలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కోదాడ రూరల్, జూన్ 3: స్థానిక హుజూర్‌నగర్ రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపంలోని ముళ్ల పొదల్లో వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండగా మున్సిపల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ రాము, ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.